నిధులున్నా నీటికి కరవే!

- నత్తనడనక ఆర్‌వో ప్లాంట్ల నిర్మాణాలు
- మున్సిపల్ విద్యార్థులకు తాగునీటి వెతలు
- దుర్వినియోగమవుతున్న నాడు-నేడు నిధులు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు


పట్టణంలోని వీరేశలింగం పాఠశాలలో మూలపడిన ఆర్వో ప్లాంటు


విద్యార్థులు ఉపయోగించే మున్సిపల్ తాగునీరు

పెద్దాపురం: కోట్ల రూపాయలతో పట్టణాభివృద్ధి చేస్తున్నాం.. విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం .. అంటూ ఊక దంపుడు ప్రసంగాలు చేస్తున్న పాలకులకు పట్టణ పాఠశాలల విద్యార్థుల నీటి కష్టాలు కనిపించడం లేదు. విద్యార్థులకు సురక్షితమైన నీటిని అందిస్తున్నామని, వేల కోట్లతో నిధులు తెచ్చి అభివృద్ధి చేశామంటున్న పాలకులకు ఆ నిధులు ఉపయోగిస్తున్నారో లేదో అనేది ప్రశ్నార్థకంగా మారింది. పట్టణంలోని ఆయా పాఠశాలల్లో గత ప్రభుత్వ హయాంలో నాడు-నాడు పథకం కింద 12 ఆర్వో ప్లాంట్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. కానీ అవి నేటికీ అమలులోకి రాకపోవడం విడ్డూరమనే చెప్పుకోవాలి. మున్సిపల్ నీటినే అరకొరగా సేవిస్తూ దాహం తీర్చుకోవాల్సిన పరిస్థితి పట్టణ పాఠశాలల విద్యార్థులది.

ఆర్వో ప్లాంట్లు నిర్వహణలోనూ అసమర్థతే..

పట్టణంలో మంజూరైన ఒక్కో ప్లాంటుకు సగటను రెండు వేల లీటర్ల నీరు అవసరం కాగా ఆయా పాఠశాలల్లో నీటి సామర్థ్యం రెండు వేల లీటర్ల ట్యాంకులు ఉండాలని గత ప్రభుత్వం నాడు-నేడు కింద వాటర్ ప్లాంట్ల నిర్మాణాలు చేపట్టింది. కానీ అవి ప్రస్తుత ప్రభుత్వంలో నిర్వహణ లోపం వల్ల ఎక్కడా కనిపించకపోవడం విడ్డూరం. ఉన్న ప్లాంట్ల వద్ద అంతటి నీటి సామర్థ్యం ఉన్న ట్యాంకులు లేకపోవడంతో విద్యార్థులకు పూర్తిగా నీటిని సరఫరా చేయలేక కొన్ని చోట్లు వాటికి తాళాలు వేసేశారు. మరి కొన్ని చోట్ల ఉన్న కాస్త నీటిని వాడుకుందామన్నా చాలీచాలని నీటి సరఫరా కంటే మున్సిపల్ మంచినీటితోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

అధికారుల నిర్లక్ష్య వైఖరి



మున్సిపల్ పాఠశాలల విద్యార్థులకు సురక్షిత నీటి సరఫరా చేయలేకపోవడంలో కేవలం అధికారుల నిర్లక్ష్య వైఖరే కారణమని చెప్పక తప్పదు. విద్యార్థుల సమస్యపై పలుమార్లు గత కౌన్సిల్‌లో మా హయాంలో నిలదీస్తే ఈ నెలలో లేదా వచ్చే నెలలో అయిపోతుందంటూ కాలం వెల్లదీసేవారు. ఇప్పటికైనా విద్యార్థులకు మాత్రం సురక్షిత నీటి సరఫరా పూర్తి స్థాయిలో అందించాలి.

– కూనిరెడ్డి అరుణ, ఐద్వా నాయకులు, పెద్దాపురం

ప్రత్యేక దృష్టి సారిస్తాం



పట్టణంలో ఆయా పాఠశాలల్లో ఉన్న ఆర్‌ఓ ప్లాంట్లు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. మరమ్మతులకు గురైన ఆర్వోప్లాంట్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత విభాగ అధికారులను ఆదేశించాం. త్వరలోనే నిర్మాణాలు పూర్తి చేసి సురక్షిత నీటిని అందజేస్తాం.

–కేవీ పద్మావతి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

పార్టీ బలోపేతానికి పటిష్ట చర్యలు


మాధవరావును సత్కరిస్తున్న వంగా గీత

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత
- పట్టణ పార్టీ అధ్యక్షుడు రావులకు సత్కారం

పిఠాపురం: క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయడానికి నూతన కార్యవర్గాన్ని నియమించడం ద్వారా చర్యలు తీసుకున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత తెలిపారు. పిఠాపురం పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా నూతనంగా నియమితుడైన రావుల మాధవరావును బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రజల మన్ననలు పొందిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని, ఆ పార్టీని ప్రజలు ఎప్పుడూ తమ గుండెల్లో పెట్టుకుంటారన్నారు. అయినప్పటికీ క్షేత్ర స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పార్టీకి కట్టుబడి పని చేస్తూ అహర్నిశలు పార్టీ కోసం పాటు పడే వారిని నూతన అధ్యక్షులుగా ఎంపిక చేసి వారికి బాధ్యతలు అప్పగిస్తున్నామన్నారు. తద్వారా గ్రామ, పట్టణ స్థాయిలో పార్టీ మరింత అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నూతన పార్టీ అధ్యక్షుడు రావుల మాధవరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన వంగా గీత నాయకత్వంలో పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యకర్తలందరికీ అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి ఇప్పటి నుంచి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొని నూతన అధ్యక్షుడు రావుల మాధవరావుకు అభినందనలు తెలిపారు.

కలెక్టరేట్ సెక్యూరిటీ ఆడిట్

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో బుధవారం సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు. ఇంటిలిజెన్స్ విభాగం నుంచి అడిషనల్ ఎస్పీ బి.మెహర్‌బాబు, డీఆర్వో జె.వెంకటరావు, ఇతర పోలీస్‌శాఖ ఎస్‌డీపీవోలు, సిఐ ఇంటిలిజెన్స్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సదనాల రామ మోహన్ ఈ ఆడిట్ కమిటీలో పాల్గొన్నారు.

కావమ్మ ఆలయం వద్ద అన్నదానం


అన్నప్రసాదాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

సామర్లకోట: స్థానిక రజకపేటలో కొలువై ఉన్న కావమ్మ ఆలయం వద్ద బుధవారం అన్నదానం ఏర్పాటు చేశారు. సంక్రాంతి సందర్భంగా ఆలయం వద్ద మూడు రోజుల పాటు తిరునాళ్ల నిర్వహించిన విషయం తెలిసిందే. తిరునాళ్ల ముగిసిన తరువాత ప్రతీ ఏడాది నిర్వహిస్తున్న అన్నదానంలో భాగంగా ఆలయ కమిటీ నాయకులు సుకపట్ల నాగేశ్వరరావు, మారిబాబుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తుల విరాళాలతో ప్రతి ఏడాది అన్నదానం నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఐదు వేల మందికి అన్నదానం చేసినట్టు తెలిపారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బదుగు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు నిమ్మకాయల కిరణ్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, శెట్టిబత్తుల దుర్గారావు పాల్గొన్ని సేవలందించారు.

పట్టాతో పాటు ఉపాధి కల్పన

ఐఐఐపీటీ డైరెక్టర్ కృష్ణ


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే ఐఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే కళాశాలతో పాటు అనుబంధ కళాశాల విద్యార్థులకు పట్టాతో పాటు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఐఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో బుధవారం సినర్జీస్ సంస్థ బీఫార్మసీ, ఎంఫార్మసీ అభ్యర్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిటోరియంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం తగిన విధంగా ఉపయోగించుకుని పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలన్నారు. ఇంటర్వ్యూలకు 200 మంది హాజరుకాగా 60 మందిని ఎంపికచేశారు. అనంతరం సినర్జీస్ సంస్థ ప్రతినిధులు వర్సిటీ ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, రెక్టార్ కేవీ రమణలను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ రవిశర్మ, హెచ్‌ఆర్ మేనేజర్ రవితేజ, చంద్రశేఖర్, ఫార్మసీ విభాగాధిపతి భవానీలు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులపై నిషేధం విధించాలి

బోట్‌క్లబ్: ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులపై నిషేధం విధించాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక సత్య దంత వైద్యశాల్లో బుధవారం పొగాకు ఉత్పత్తులు, మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పొగాకు, గంజాయి ఉత్పత్తుల వినియోగాన్ని నిలిపివేసిన తర్వాత మొదటి 12 గంటల్లో మన శరీరంలో ఆక్సిజన్ స్థాయిలు పెరుగుతాయన్నారు. కార్బన్ మోనాక్సైడ్ స్థాయిలు తగ్గుతాయన్నారు. పొగాకు వినియోగానికి దూరంగా ఉంటే గుండెపోటును ఎదుర్కొనే ప్రమాదం తగ్గుతుందన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్, మూత్రాశయం, గొంతు, రక్తం, గర్భాశయం, కాలేయం, నోరు, పాంక్రియాస్, పెద్దపేగు, ఇతర క్యాన్సర్లతో సహా అనేక ప్రాణాంతక వ్యాధులు ధూమపానంతో సంబంధం కలిగి ఉంటాయన్నారు. అసోసియేషన్ కన్వీనర్ శ్రీవల్లి మాట్లాడుతూ ధూమపాన రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నాగేంద్ర పాల్గొన్నారు.

పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు సూర్యప్రకాశరావు


ఉప్పాడలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తపల్లి: ప్రభుత్వం అందిస్తున్న పశు ఆరోగ్య శిబిరాల సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు సూర్య ప్రకాశరావు అన్నారు. మండలంలోని ఉప్పాడ, మూలపేటలో కొత్తపల్లి పశువైద్యాధికారి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాలను సూర్య ప్రకాశరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ శిబిరాలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందని ఆయన తెలిపారు. పశువుల ఆరోగ్యానికి చికిత్స, ఉత్పాదకతను పెంచడానికి, చికిత్స, వ్యాధులను నియంత్రించేందుకు టీకాలు, పశుపోషణ ఖర్చులు తగ్గించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ శిబిరాలలో పశువులను పరిక్షించడంతో పాటు శస్త్ర చికిత్సలు చేయనున్నట్టు తెలిపారు. ఎదకు రాని, చూడి కట్టని, గర్భ కోశ వ్యాధులకు పశువైద్యులతో పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. మండలంలో నేడు వాకతిప్ప, నాగులాపల్లి, శుక్రవారం ఎండపల్లి, ఇసుకపల్లి, 25న గోర్స, రమణక్కపేట, 27న కుతుకుడుమిల్లి, శ్రీరాంపురం, 28న కొండెవరం, పొన్నాడ, 29న కొమరగిరిలో శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ రమేష్ చంద్ర, పశువైద్యులు సందీప్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఉరుస్

దర్గా వద్ద అన్న సమారాధన


దర్గా వద్ద అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ముస్లింలు, నాయకులు

పెద్దాపురం: మూడు రోజుల పాటు నిర్వహించే హజరత్ షేక్ మదీనా పాఛ్ఛా ఔలియా (తొమ్మిది మూరల సాహెబ్) ఉరుస్ గంధోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. దర్గా వద్ద మతాలకు అతీతంగా భారీ అన్నదాన నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ చైర్మన్ ఎంఎల్ అలీ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా ఉరుస్ ఉత్సవం దోహదపడుతుందన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాల ఐక్యతకు ప్రతీకగా ఉరుస్ ముగింపు ఉత్సవంలో భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కౌడా చైర్మన్ తుమ్మల బాబు, పెద్దాపురం ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ బొడ్డు బంగారుబాబు ప్రారంభించిన అన్న సమారాధనలో సుమారు ఐదు వేల మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో అగ్రో మాజీ డైరెక్టర్ సయ్యద్ జానీ, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, బాబూలాల్, ఆషిక్ అలీ, అబ్దుల్ రజాక్, రఫీ, గౌస్, జలీల్, జకీర్, నజీర్, ముక్తార్ అలీ, ఆరీఫ్, ఇర్షాద్ అలీ, యాళ్ల వీర బాబు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్ల అపహరణ

- సమీపంలో చెల్లాచెదరుగా విడిభాగాలు
- రాగి తీగలకోసం చేసిన పనిగా అనుమానం
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కరప: మండలం గొర్రిపూడిలోని శ్రీరాజశేఖర పరస్పర సహకార ఎత్తిపోతల పథకం వద్ద రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అపహరణకు గురయ్యాయి. గొర్రిపూడిలోని ఎత్తిపోతల పథకం ద్వారా కరప, తాళ్లరేవు మండలాల్లోని ఆరు గ్రామాలకు సుమారు 4,800 ఎకరాలకు సాగునీరు అందుతోంది. 2009 సంవత్సరం ఫిబ్రవరి నెలలో అప్పటి తాళ్లరేవు ఎమ్మెల్యే దొమ్మేటి వెంకటేశ్వర్లు అభ్యర్థన మేరకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ.12.54 కోట్లు మంజూరు చేశారు. తదనంతర కాలంలో ఆ నిధులతో ఎత్తిపోతల పథకం నిర్మించి వైఎస్సార్ పేరుపెట్టారు. ప్రస్తుత రబీలో పంట కాలువల్లో నీటిమట్టం పడిపోవడంతో రైతుల వినతి మేరకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరందించేందుకు అధికారులు, స్థానిక నాయకులు నిర్ణయించారు. ఈ క్రమంలో గొర్రిపూడి నీటి సంఘం అధ్యక్షుడు జోకా అప్పలరాజు బుధవారం గండి వెంకటేశ్వరరావు, అనుకుల రాంబాబు తదితర నాయకులతో కల్సి ఎత్తిపోతల పథకం పరిశీలనకు వెళ్లారు. మోటార్లు పనిచేయకపోవడంతో విద్యుత్ సరఫరాను పరిశీలించగా అక్కడ ఉండే రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అపహరణకు గురైనట్టు గుర్తించారు. వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. పరిసర ప్రాంతాల్లోని పొదల్లో పరిశీలించగా ట్రాన్స్‌ఫార్మర్ల విడిభాగాలు కనిపించాయి. ఎవరో దొంగలు వాటిలోని రాగిని దొంగిలించి ఉంటారని భావిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనంపై నీటి సంఘం అధ్యక్షుడు, గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కూడా ఫిర్యాదు చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. ఎస్సై టి.సునీత క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి కేసులో ఒకరికి రెండేళ్ల జైలు

కాకినాడ లీగల్: ఇంటి సరిహద్దు విషయంలో గొడవ జరగడంతో మహిళపై అసభ్యంగా ప్రవర్తించి ఆమెను గాయపరిచి, బెదిరించిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు, వారి కుటుంబ సభ్యులకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ప్రసన్న లక్ష్మి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ రామకృష్ణరావుపేట గోరుసువారి వీధికి చెందిన గొరుసు రాజకీర్తి, అతని తండ్రి నూకరాజు, చెల్లి సభరి కలిసి 2016లో ఇంటి పక్క నివసిస్తున్న నంబట్ల సత్యవతితో సరిహద్దు విషయమై గడవపడి ఆమెపై రాళ్లతోను, కర్రతోను గాయపరచారు. అలాగే సత్యవతి పట్ల రాజకీర్తి అసభ్యకరంగా ప్రవర్తించి, గాయపరిచి, బెదిరించాడు. దీంతో నంబట్ల సత్యవతి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో గొరుసు రాజకీర్తిపై నేరం రుజువు కావడంతో ఐపీసీ సెక్షన్ 354 ప్రకారం అసభ్యంగా ప్రవర్తించినందుకు రెండేళ్ల జైలు, ఐపీసీ సెక్షన్ 324 ప్రకారం గాయపరిచినందుకు ఆరు నెలల జైలు, మరో సెక్షన్ ప్రకారం రూ.వెయ్యి జరిమానా విధించారు.అలాగే నూకరాజు, సభరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పై రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని తీర్పులో పేర్కొన్నారు. ఏపీపీ గోసాల కమల కుమారి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

గ్రీన్ క్యాంటీన్ ప్రారంభం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ప్రిన్సిపాల్ భవనం ఎదురుగా ఏర్పాటు చేసిన గ్రీన్ క్యాంటీన్‌ను బుధవారం జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ మురళీకృష్ణ ప్రారంభించారు. గతంలో ఉన్న క్యాంటిన్ స్టూడెంట్ ఎమినిటీ భవనం పై అంతస్తులో ఉండటం వల్ల విద్యార్థులు, టీచింగ్ సిబ్బందికి అసౌకర్యంగా ఉండటం వల్ల పాత స్థానంలో ఏర్పాటు చేశామని, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారితో పాటు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, డైరెక్టర్లు బీటీ కృష్ణ, రవీంద్ర, బాలకృష్ణ, ఏసురత్నం, కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ మోహనరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యాపార సంస్థల్లో సీసీ కెమెరాలు ఉండాలి


బస్సు కాంప్లెక్స్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణ భగవాన్

సామర్లకోట: ప్రతి వ్యాపార సంస్థలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ ఎ.కృష్ణ భగవాన్ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక బస్సు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన పరిశీలించారు. ఈ మేరకు కాకినాడ డిపో అధికారులతో మరికొన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించడంతో వారు సానుకూలంగా స్పందించారని సీఐ తెలిపారు. బస్సు కాంప్లెక్స్, స్టేషన్ సెంటర్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటుతో దొంగతనాలు తగ్గాయని చెప్పారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రయాణికులకు సూచించారు.

విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు


కొత్తపల్లి జెడ్పీ పాఠశాల వద్ద పర్యవేక్షిస్తున్న ఎస్సై వెంకటేష్

కొత్తపల్లి: పాఠశాలలు, కళాశాలల వద్ద యువత ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై వెంకటేష్ హెచ్చరించారు. మండలంలోని స్థానికంగా ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలు, వీవీఎస్ కళాశాల వద్ద బుధవారం పోలీస్ సిబ్బంది నిఘా ఏర్పాటు చేశారు. పాఠశాలలు విడిచిపెట్టే సమయంలో యువత మోటారు సైకిళ్లపై ప్రమాదకరంగా తిరగడం, అనుచితంగా ప్రవర్తిస్తున్నారన్న సమాచారం రావడంతో ఎస్సై తన సిబ్బందితో పర్యవేక్షించారు. ఎవరైనా ఆకతాయిలు విద్యార్థినుల పట్ల దురుసుగా వ్యవహరించినా వారి సమాచారం అందించాలన్నారు.

ఏలేరు నుంచి 53 వేల ఎకరాలకు సాగునీరు


ఏలేరు నీటి ద్వారా సాగయ్యే భూములను పరిశీలించిన డీఈ తదితరులు


సామర్లకోట: ఏలేరు కాలువ ద్వారా 53,017 ఎకరాలకు సాగునీరు అందజేస్తున్నట్లు సామర్లకోట ఇరిగేషన్ డీఈ ఆకెళ్ల రవికుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఏలేరు కాలువ ద్వారా సాగు అవుతున్న పంట భూములను ఆయన పరిశీలించారు. రబీ సాగుకు ఏలేరు ప్రాజెక్టు నుంచి 1400 క్యూసెక్కుల నీరు విడుదల అవుతూ ఉండగా దానిలో 200 క్యూసెక్కుల నీటిని విశాఖ స్టీల్ ప్లాంటుకు ఇస్తున్నామన్నారు. మిగిలిన 1200 క్యూసెక్కులు రబీ వరి సాగుకు కేటాయించినట్టు తెలిపారు. ప్రస్తుతం రబీ సాగుకు ఎక్కడా నీటి ఎద్దడి లేదన్నారు. ప్రస్తుతం జలాల విడుదల ద్వారా దిగువ ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

మజ్దూర్ యూనియన్ బ్రాంచి కార్యదర్శిగా కొప్పల


కొప్పల రాజేశ్వరరావు

సామర్లకోట: సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బ్రాంచి కార్యదర్శిగా కొప్పుల రాజేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు విజయవాడ డివిజన్ బ్రాంచి ప్రధాన కార్యదర్శి జీఎన్ శ్రీనివాసరావు, కార్యదర్శి విజయకుమార్‌లు తెలిపారు. ఈ మేరకు రాజేశ్వరరావును మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు, సభ్యులు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సిరసపల్లి ఈశ్వరరావు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన సిరసపల్లి ఈశ్వరరావు (40) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో అతని ఇంటి పైనుంచి మెట్లు దిగుతూ అదుపు తప్పి ప్రమాదవశాత్తు జారిపడిపోవడంతో తలకు రక్తపు గాయం అయ్యింది. దీంతో అతని బంధువులు పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అతని భార్య సిరసపల్లి సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు వ్యవసాయ కూలీగా పని చేస్తుంటాడు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో నాగు ప్రతిభ


రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ సహాయ నటుడిగా బహుమతిని అందుకుంటున్న నాగు

పెద్దాపురం: బాపట్ల జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో ఉత్తమ సహాయ నటుడిగా పెద్దాపురం మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన కేదారి నాగు బహుమతిని కైవసం చేసుకున్నారు. ప్రజా నాట్యమండలి నాయకులుగా, మేకప్‌మెన్‌గా సేవలందిస్తూ నాటక రంగంలో తనదైన శైలిలో దూసుకు వెళ్తున్న నాగు ×జనరల్ భోగీలు× నాటికలో సహాయ నటుడుగా నటించారు. 9 రోజుల రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన నాగును పలువురు ప్రముఖులు అభినందించారు. స్నేహ ఆర్ట్స్ అధ్యక్షులు గొందేశి రాజా, పీఎన్ఎం నాయకులు రొంగల వీర్రాజు, డి.కృష్ణ, సత్యనారాయణ, రాంబాబు, మంతెన సత్తిబాబు, సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్ తదిరులు అభినందించిన వారిలో ఉన్నారు.

పథకాలతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం


విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న సోషల్ ఆడిట్ అధికారి హరి

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న పలు పథకాలతో పాఠశాలలు బలోపేతం అవుతాయని సోషల్ ఆడిట్ అధికారి కె.హరి అన్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం ఆయన సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ మేరకు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, సభ్యులతో పాఠశాల పనితీరుపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలకు మంజూరైన నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల రికార్డులను ఆయన పరిశీలించారు. అలాగే పాఠశాలలో నిర్వహిస్తున్న ఆర్వో ప్లాంటు, క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రోడ్డు ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసరావు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డు జ్యోతుల గోదాముల వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు కథనం ప్రకారం ఏడీబీ రోడ్డులోని రిలయన్స్ ప్యాక్టరీలో సూపర్‌వైజరుగా పని చేస్తున్న శ్రీనివాసరావు మోటారు సైకిల్‌పై వెళుతూ ఉండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దాంతో తీవ్రంగా గాయపడిన అతడిని గమనించిన స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకుని ప్రైవేటు అంబులెన్సులో అచ్చంపేట ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందిన్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం, దౌర్జన్యంపై ఫిర్యాదు

కరప: ప్రతి రోజూ కిరాణాషాపు వద్దకు వచ్చి దూషించడంతో పాటు అర్ధరాత్రి తలుపులు పగలకొట్టి, తమపై దౌర్జన్యంచేసి, కిరాణా వస్తువులు తీసుకువెళ్లిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కరప మండలం గొర్రిపూడి గ్రామంలో మేడిశెట్టి వెంకటలక్ష్మి కిరాణా షాపు నిర్వహిస్తోంది. అదే గ్రామానికి చెందిన పుణ్యమంతుల అప్పన్న సంక్రాంతి పండగ నుంచి ఇంటికి వచ్చి దూషిస్తూ గొడవచేస్తున్నాడు. నిందితుడు అప్పన్న ఈనెల 14వ తేదీన అర్ధరాత్రి 11 గంటల సమయంలో వెంకటలక్ష్మి ఇంటికి వచ్చి, తలుపులు పగలకొట్టి, లోపలికి ప్రవేశించి ఆమె పైన, ఆమె భర్తపైన దౌర్జన్యంచేసి, కిరాణా వస్తువులు పట్టుకుని వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని గ్రామ పెద్దలలో పెట్టినా అప్పన్నలో మార్పు రాలేదు. దీంతో వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.సునీత కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు

విమానాశ్రయానికి కృషి చేయండి

కాకినాడ: కాకినాడలో విమానాశ్రయం ఏర్పాటు చేసేందుకు ఇక్కడి ప్రజాప్రతినిధులు మరింత కృషి చేయాలని గోదావరి జిల్లా, కోకనాడ ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు వైడీ రామారావు కోరారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులకు సంఘం తరఫున లేఖ రాశారు. ఇటీవల అన్నవరం ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రతిపాదనలు వెళ్లడం హర్షణీయమని, అయితే సదరు ప్రతిపాదనకు విమానయాన శాఖ అనుమతి దక్కకపోవడం నిరుత్సాహపరిచిందన్నారు. ఎంతో కాలంగా గురజానపల్లి ఉప్పు భూముల్లో ప్రతిపాదించిన విమానాశ్రయ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీలకు విజ్ఞప్తి చేశారు.